

www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

బుధవారం | 14 | అక్టోబర్ | 2026 | పేజీలు: 08


## పయనం ప్రాణ సంకటం

పట్టించుకోని యంత్రాంగం

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా ?

3





# కాసులు కురిపిస్తున్న 'మట్టి'

- బొంరెడ్డిపల్లిలో అక్రమ ఇసుక దందా
- కాసులు కురిపిస్తున్న 'మట్టి'..
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి!
- పంట భూముల్లో వందల కొద్దీ మట్టి డంపులు
- మట్టిని శుద్ధి చేసి ఇసుకగా మార్చుతున్న అక్రమార్కులు
- రోజుకు పదుల సంఖ్యలో యథేచ్ఛగా ఇసుక రవాణా
- కన్నెత్తి చూడని అధికారులు
- లబోదిబోమంటున్న రైతులు



**పరిగి, అక్షిత ప్రతినిధి :** పరిగి నియోజకవర్గ పరిధిలోని కుల్కచర్ల మండలం బొంరెడ్డిపల్లి గ్రామంలో అక్రమ ఇసుక దందాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. అన్నం పెట్టే పంట భూములు కాస్తా అక్రమార్కుల చేతుల్లో ఇసుక క్వారీలుగా మారుతున్నాయి. కొందరు స్వార్థ పరులు, అక్రమార్కులు కలిసి పచ్చని పంట పొలాలను మట్టి డంపులుగా మార్చేస్తున్నారు. వందల ట్రాక్టర్ల తప్పుల మట్టిని తెచ్చి ఇక్కడ నిల్వ చేసి, దానిని శుద్ధి చేసి (వాషింగ్) ..మిగతా 2లో

### రూ.4.26 కోట్లతో

# బౌద్ధ క్షేత్ర ప్రగతి

- నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి
- కలెక్టర్ దివాకర టీఎస్
- పురావస్తు కట్టడాల పరిరక్షణ పునరుద్ధరణ పనులకు రూ.4.26 కోట్లు
- కంబోడియా థాయ్‌లాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు

2



### గోదావరి పుష్కర పనులకు

# వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాచలం, అక్షిత న్యూస్:** గోదావరి పుష్కరాల గడువు సమీపిస్తుండటంతో అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. పనుల్లో జాప్యాన్ని సహించేది లేదని ఆయన హెచ్చరించారు. ఆలయ అభివృద్ధి, పుష్కర ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తేల్చిచెప్పారు. ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు మూడు కిలోమీటర్ల మేర సుందరీకరణ ..మిగతా 2లో

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY జాతీయ దినపత్రిక



# గోదావరి పుష్కర పనులకు వేగం పెంచాలి

మొదటి పేజీ తరువాయి...

ప్రణాళికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని సూచించారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలన**

భద్రాచలం విచ్చేసిన కలెక్టర్ అంకిత్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేవతో కలిసి మంగళవారం ఆలయ అభివృద్ధి పనులు, గోదావరి ఘాట్లు, వైకుంఠధామం మార్గాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో నిర్మాణాలు, రక్షణ గోడలు, ఘాట్ల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం 25 అడుగులుగా ఉన్న ఘాట్ల రహదారిని 30 అడుగులకు విస్తరించాలని, వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని సూచించారు. పరిసరాల్లో ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు.

**ఘాట్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి**

270 మీటర్ల ఉత్తర ఘాట్, 230 మీటర్ల దక్షిణ ఘాట్ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పాత గోడలకు మరమ్మతులు చేపట్టడంతో పాటు, భక్తులకు ఇబ్బందులు కలగకుండా మెట్లు, ల్యాండింగ్ ప్రాంతాలను పటిష్ఠంగా నిర్మించాలన్నారు. వర్షాకాలంలో అభివృద్ధి పనులకు టెండర్ల ప్రక్రియను త్వరగా పూర్తి చేసి, పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

**200 మంది కార్మికులతో పనులు**

ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు 200 మంది కార్మికులు, 10మంది ప్రత్యేక బృందాలతో ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు పనులు చేపట్టాలని సూచించారు. పుష్కరాల నాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. భక్తుల వసతి కోసం డార్మెటరీ హాలు, గోశాల అభివృద్ధి పనులు, త్రాగునీరు, పారిశుద్ధ్యం, రవాణా, వైద్యశాల, పోలీసు భద్రత ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు. ఐటిసి నుంచి బ్రిడ్జి వరకు రహదారికి ఇరువైపుల పుష్పించే మొక్కలు మధ్య డివైడర్లతో సుందరీకరణ చేపట్టాలని ఇందుకు సంబంధించిన సమగ్ర ప్రణాళికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

**గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్, అక్షిత ప్రతినిధి : బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రానున్న గోదావరి పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

మంగళవారం బాసరలో పర్యటించిన కలెక్టర్, ముందుగా శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలను జాగ్రత్తగా తొలగించాలని సూచించారు. ఆలయ నిర్మాణ పనులన్నీ నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తూ, నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్ అండ్ బీ, నీటిపారుదల శాఖల ఈఈలు సుభాష్, అనిల్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, ఆలయ ఈవో అంజనా దేవి, తహసీల్దార్ పవన్ చంద్ర, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాసులు కురిపిస్తున్న 'మట్టి'

మొదటి పేజీ తరువాయి...



ఇసుకగా మార్చి మార్కెట్ లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దందా వల్ల ప్రభుత్వ ఆదాయానికి రోజుకు లక్ష ల్లో గండి పడుతుండగా, స్థానిక రైతులు తమ భూములు పాడవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**పంట భూముల్లో మట్టి డంపుల సామ్రాజ్యం**

బొంరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని వ్యవసాయ భూముల్లో ప్రస్తుతం ఎటు చూసినా పెద్ద పెద్ద మట్టి దిబ్బలే దర్శనమిస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా పంటలు పండించే భూముల్లో కొందరు అక్రమార్కులు వందల కొద్దీ తప్పుల మట్టిని తెచ్చి డంపులుగా ఏర్పాటు చేశారు. ఆ మట్టిని అక్కడే అత్యాధునిక పద్ధతుల్లో లేదా నీటితో శుద్ధి చేసి, నాణ్యమైన ఇసుకగా మారుస్తున్నారు.

**యథేచ్ఛగా రవాణా నిద్రపోతున్న అధికార యంత్రాంగం**

ఈ అక్రమ కేంద్రం నుండి రోజుకు ఐదు నుండి పదుల సంఖ్యలో లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుకను ఇతర ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా, ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా రాత్రి పగలు ఈ దందా సాగుతోంది. స్థానికంగా ఈ విషయంపై చర్చ జరుగుతున్నా, రోజుకు పదుల సంఖ్యలో వాహనాలు ఇసుకను తరలిస్తున్నా సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులు మాత్రం కన్నెత్తి చూడకపోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ఉదాసీనత అక్రమార్కులకు వరంగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**రైతుల ఆవేదన.. చర్యలు తీసుకోవాలని డిమాండ్**

పంట భూముల్లో ఇలాంటి అక్రమ వాషింగ్ ప్లాంట్లు, మట్టి డంపులు ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములు కూడా చౌడుబారిపోయే ప్రమాదం ఉందని స్థానిక రైతులు లబోదిబోమంటున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, పర్యావరణాన్ని నాశనం చేస్తున్న ఈ అక్రమ ఇసుక దందాపై జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, మైనింగ్ అధికారులు వెంటనే బొంరెడ్డి పల్లిలో తనిఖీలు చేపట్టి, అక్రమ డంపులను సీజ్ చేసి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**తహసిల్దార్ వివరణ**

అక్రమంగా ఎవరైనా ఇసుక రవాణ చేస్తే కఠినంగా చర్యలు తీసుకుంటాం. మా దృష్టికి వస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు అని తెలిపారు.

# రూ.4.26 కోట్లతో బౌద్ధ క్షేత్ర ప్రగతి

**నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి**

**కలెక్టర్ దివాకర టీఎస్**

**పురావస్తు కట్టడాల పరిరక్షణ పునరుద్ధరణ పనులకు రూ.4.26 కోట్లు**

**కంబోడియా థాయిలాండ్, భారత దేశాలకు చెందిన బౌద్ధ భిక్షువులతో అంతర్జాతీయ స్థాయిలో బౌద్ధ క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్‌పై చర్చలు**

ఖమ్మం /అక్షిత బ్యూరో : ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లిలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాచీన బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి బౌద్ధ వారసత్వ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. మంగళవారం నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి పురావస్తు కట్టడాల పరిరక్షణ పునరుద్ధరణపై బౌద్ధ భిక్షువుల సలహాలు సూచనలు స్వీకరించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నేలకొండపల్లి తెలంగాణలోని అత్యంత ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన బౌద్ధ పురావస్తు క్షేత్రాలలో ఒకటని తెలిపారు. నేలకొండపల్లిలో గతంలో నిర్వహించిన పురావస్తు తవ్వకాల ద్వారా మహాస్తూపం బౌద్ధ విహారాలు సమావేశ మందిరాలు ఇతర బౌద్ధ నిర్మాణాల అవశేషాలు వెలుగులోకి వచ్చాయన్నారు.

పురావస్తు ఆధారాలు ప్రాచీన కాలంలో నేలకొండపల్లి ప్రముఖ బౌద్ధ ధార్మిక సాంస్కృతిక కేంద్రంగా విలసిల్లిందని తెలియజేస్తున్నాయని ఈ చారిత్రక సంపదను శాస్త్రీయ పద్ధతిలో పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంతో పాటు దేశ విదేశాల బౌద్ధ యాత్రికులను ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమని అన్నారు.



కేవలం ఒక భవన నిర్మాణంలా కాకుండా బౌద్ధ ధర్మానికి గౌరవ సూచకంగా దానికి అనుగుణంగా ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల ప్రణాళిక రూపకల్పన కోసం పురావస్తు శాఖ సంచాలకులతో పాటు బౌద్ధ ధర్మ నిపుణులు శివనాగిరెడ్డి రిటైర్డ్ ఐపీఎస్ ఉపేంద్ర రెడ్డి బుద్ధవనం స్పెషల్ ఆఫీసర్ లక్ష్మయ్య తదితరులతో కూడిన ఒక నిపుణుల కమిటీ (కోర్ టీమ్)ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బౌద్ధ భిక్షువులు నిపుణుల సలహాలు సూచనలను స్వీకరించి వచ్చే ఒకటిన్నర సంవత్సరంలో నేలకొండపల్లిని అత్యున్నత బౌద్ధ క్షేత్రంగా మారుస్తామని తెలిపారు. జీవనంలో మోహాలు మాయలు వీడి గౌతమ బుద్ధుడు చూపిన మధ్యే మార్గం ద్వారానే మానవజాతి శాంతియుతంగా జీవించగలదని అటువంటి మహోన్నత జ్ఞానాన్ని అందించిన బౌద్ధ ధర్మ ప్రచారానికి ఈ ప్రాజెక్ట్ ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. భారతదేశంలోని ప్రముఖ బౌద్ధ క్షేత్రాల సరసన నేలకొండపల్లిని టాప్-3 లో నిలపడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాడి మాట్లాడుతూ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూ. 2.50 కోట్ల వ్యయంతో నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రంలో పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో భాగంగా పర్యాటకులకు అవసరమైన సౌకర్యాలు సందర్శకుల మార్గాలు ప్రాంగణ సుందరీకరణ సమాచార సూచికలు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నారన్నారు. రూ. 1.76 కోట్ల వ్యయంతో ప్రాచీన బౌద్ధ విహారాలు సమావేశ మందిరం సంబంధిత పురావస్తు నిర్మాణాల పరిరక్షణ పునరుద్ధరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులకు అవసరమైన నిధులను వైటీపీఎస్ తెలంగాణ జెన్ కో ద్వారా సమకూర్చుకున్నట్లు అన్నారు. పురావస్తు కట్టడాల అసలు నిర్మాణ స్వరూపం చారిత్రక ప్రాధాన్యత నిర్మాణ శైలి దెబ్బతినకుండా శాస్త్రీయ పరిరక్షణ పద్ధతుల్లో పనులను చేపట్టనున్నట్లు హెరిటేజ్ తెలంగాణ శాఖ డైరెక్టర్ తెలిపారు. కంబోడియా థాయిలాండ్ భారత దేశానికి చెందిన బౌద్ధ భిక్షువులు నేలకొండపల్లి ప్రాచీన బౌద్ధ క్షేత్రం చారిత్రక ఆధ్యాత్మిక ప్రాధాన్యతపై ఆసక్తి వ్యక్తం చేశారు. నేలకొండపల్లి మహాస్తూపం బౌద్ధ విహారాలు ఇతర ప్రాచీన నిర్మాణాలను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేసి ప్రపంచ బౌద్ధ యాత్రికులను ఆకర్షించే ప్రముఖ బౌద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. నేలకొండపల్లి బౌద్ధ క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి సమగ్ర మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై కార్యక్రమంలో ప్రత్యేక చర్చలు జరిగాయి. ఇట్టి చర్చల్లో హెరిటేజ్ తెలంగాణ శాఖ తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు పురావస్తు పర్యాటక రంగ నిపుణులు కన్సల్టెంట్లతోపాటు ఆంజనేయ రెడ్డి మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సలహాలు సూచనలతో మాస్టర్ ప్లాన్ రూపొందించే అంశంపై చర్చించారు. ఈ ప్రణాళికలో మహాస్తూపం పరిరక్షణ బౌద్ధ విహారాల పునరుద్ధరణ పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధి సందర్శకుల నిర్వహణ ప్రాంగణ సుందరీకరణ బౌద్ధ చరిత్రను వివరించే సమాచార వ్యవస్థ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కమీషనర్ పివి శ్రీనివాస రావు హెరిటేజ్ తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్లు డా. పి నాగరాజు ఎన్. నరసింగ్ సూపరింటెండెంట్ ఎ రాజు జిల్లా పర్యాటక శాఖ అధికారి సుమన్ చక్రవర్తి జిల్లా ఇంటర్మీడియేట్ అధికారి రవి బాబు నేలకొండపల్లి మండల తహసీల్దార్ రాంప్రసాద్ సర్పంచ్ శీలం వెంకటలక్ష్మి హైదరాబాద్ ఫ్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డా.ఇ. శివనాగిరెడ్డి వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అంతర్జాతీయ బౌద్ధ భిక్షువులు పురావస్తు పరిశోధకులు పర్యాటక రంగ ప్రతినిధులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పయనం ప్రాణ సంకటం

### పట్టించుకోని యంత్రాంగం

### ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా ?




నర్సంపేట, అక్షిత ప్రతినిధి : నెక్కొండ మండలం గుండ్రపల్లి చెరువు కట్ట రహదారి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. దారి అత్యంత ఇరుకుగా ఉండటం, దానికి తోడు గుంతలమయం కావడంతో నిత్యం ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు తీవ్ర నరకయాతన అనుభవిస్తున్నారు. మంగళవారం ఈ కట్టపై ఆర్టీసీ బస్సు, లారీ ఎదురెదురుగా రావడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. కట్టపై ఇరుకు దారిలో లారీని దాటే క్రమంలో బస్సు ఏమాత్రం అదుపుతప్పినా కింద పడిపోయే ప్రమాదం ఉండటంతో.. ప్రాణభయంతో ప్రయాణికులు బస్సులోంచి కిందకు పరుగులు తీశారు. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించిపోవడంతో చివరకు ప్రయాణికులు, స్థానికులే స్వయంగా రంగంలోకి దిగి బస్సును సురక్షితంగా దాటించి ప్రాణాలతో బయటపడ్డారు.




నెక్కొండ మీదుగా పెద్దకొర్పోల్, కేసముద్రం వైపు వెళ్లే ఈ ప్రధాన మార్గంలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ముఖ్యంగా ఉదయం పూట స్కూల్ బస్సులు, ఆటోలు ఈ ఇరుకు దారిలో చిక్కుకుని విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వస్తే ఈ రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. కట్ట మీదున్న గుంతల్లో నీరు నిలిచి, రోడ్డంతా బురదమయంగా మారుతుండటంతో ద్విచక్ర వాహనదారులు అడుగడుగునా జారిపడుతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు.

ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోజూ వందలాది మంది ప్రయాణికులు ప్రాణభయంతో రాకపోకలు సాగిస్తున్నా ఈ దారిని వెడల్పు చేయాలన్న సోయి అధికారులకు కరువైంది. ఏదైనా పెద్ద ప్రమాదం జరిగి పదుల సంఖ్యలో ప్రాణాలు గాల్లో కలిశాక తీరికగా స్పందిస్తారా అంటూ ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్ర మత్తు వీడి, తక్షణమే గుండ్రపల్లి చెరువు కట్ట రోడ్డును వెడల్పు చేయాలని, గుంతలు పూడ్చి ప్రమాదాలను నివారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# బకాయిల బరువు కింద నలిగిన బతుకులు

### సిపిఐ శాసనసభ పక్ష నేత కూనంనేనికి ప్రైవేట్ కాలేజీల వినతి




మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి : గత ప్రభుత్వం అలసత్వం వలన ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల కాకపోవడం వలన కొలువులు దూరమవుతవున్నాయి, ఆశలు కూలిపోతున్నాయని చమటోడ్చిన తల్లిదండ్రుల కష్టం నీరుగారిపోతుందని చదువుకునే పసి మనసులు నైరాశ్యం చెందకుండా ఉండకుండా, యాజమాన్యాలు అప్పుల కోరల్లో చిక్కుకుండా, అధ్యాపకుల జీవితాలు రోడ్డున పడకుండా ఉండాలంటే బకాయిలు సకాలంలో విడుదల చేసే విధంగా ప్రయత్నం చేయాలని సిపిఐ శాసనసభ పక్షనేత కూనంనేని సాంబశివరావుని ప్రయివేటు కళాశాల యాజమాన్యం, విజేత డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ తెడ్ల ధనుంజయ కోరారు. ఈ సందర్భంగా సాంబశివరావు డిగ్రీ, పిజి కళాశాలల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకు వస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మధు, పాపయ్య, హరి, వీరయ్య బాలాజీ పాల్గొన్నారు.

# ఎన్నారై వాసవి ఫౌండేషన్ సహకారంతో వాటర్ ప్లాంట్ ప్రారంభం

చేర్యాల అక్షిత ప్రతినిధి: మండలంలోని కడవేరుగు గ్రామంలో అమెరికా ఎన్నారై వాసవి ఫౌండేషన్ సహకారంతో నూతన వాటర్ ప్లాంట్ను ప్రారంభించారు. ప్లాంట్ ఏర్పాటుకు గంపా రామ్మోహన్, పద్మావతి ఆర్థిక సహకారం అందించగా, స్థలం కోసం ధరూరు సుహాసిని, రంగారెడ్డి సహకరించారు. అదేవిధంగా భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ తాళ్లపల్లి రమేష్ గుప్త మరియు గ్రామపంచాయతీ పాలకవర్గం సహకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ.. గత పది నెలల్లో గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు, చెరువుల సుందరీకరణ, చెరువు మెట్ల నిర్మాణం, వాటర్ ప్లాంట్ ఏర్పాటు వంటి అభివృద్ధి పనులను



చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో గ్రామాన్ని ముందుకు తీసుకెళ్తామని పేర్కొంటూ, గ్రామాభివృద్ధికి సహకరించిన దాతలకు గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో నూతన వాటర్ ప్లాంట్ ఏర్పాటు అయినందున ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని పంచాయతీ పాలకవర్గాన్ని సర్పంచి కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగ సురేందర్, సెక్రటరీ తరిగొప్పుల రాజు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామం క్షేమం కోసమే అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పణ

### రేపాల ఉపసర్పంచి తుమ్మ సతీష్



అక్షిత న్యూస్ మునగాల: మునగాల: మునగాల మండలం రేపాల గ్రామంలో దేవి శరన్ నవరాత్రుల సందర్భంగా గ్రామం పరిధిలో ఒకటవ వార్డులో విఘ్నేశ్వర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గాదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు పూలు పండ్లు గాజులు పసుపు కుంకుమ సమర్పించిన రేపాల ఉపసర్పంచ్ తుమ్మ సతీష్. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుమ్మ సతీష్ మాట్లాడుతూ గ్రామం క్షేమం గా ఉండాలని రైతులకు పాడిపంటల్లో కలిసి రావాలని గ్రామ అభివృద్ధి లక్ష్యంగా అభివృద్ధి జరగాలని అమ్మవారికి ప్రత్యేక పూజ చేసి ప్రార్థిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమారుడు హరి వరుణ్ తేజ ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మెదక్లో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### చిలుకూరు బిజెపి మండల అధ్యక్షులు పారెల్లి మహేష్ డిమాండ్




చిలుకూరు,అక్టోబర్ 13, (అక్షిత న్యూస్): మెదక్ పట్టణ ప్రవేశంలోని ఆటో నగర్ కూడలి వద్ద తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) చిలుకూరు మండల అధ్యక్షులు పారెల్లి మహేష్ తీవ్రంగా ఖండించారు. ఈ అనాగరిక ఘటనపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ తన తీవ్ర నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవానికి, హక్కుల పోరాటానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని కూల్చివేయడం అంటే ఐదు కోట్ల తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. ఇటువంటి ఘటనలు సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

# భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న నాయిని నీలిమ రెడ్డి





కాజీపేట్, అక్షిత ప్రతినిధి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిన్న సాయంత్రం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి సతీమణి నాయిని నీలిమ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి భద్రకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

# యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలి

**పట్టభద్రుల నిరుద్యోగ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి...**

**బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర పీఏసీ సభ్యులు, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు స్వయం ఉపాధికి అవసరమైన రుణాలు, సబ్సిడీలు, నైపుణ్య శిక్షణ, మార్కెటింగ్ సహాయం అందించాలని డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా చిలుకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ..

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి, ఉద్యోగ నోటిఫికేషన్లు, పరీక్షలు, నియామక ప్రక్రియలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల వారీగా నిరుద్యోగ పట్టభద్రుల గణాంకాలను వెల్లడించి, స్థానిక పరిశ్రమలు, ఐటీ, సేవా రంగాలు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించాలన్నారు.

ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు అవసరమైన మౌలిక వసతులు, భూమి, విద్యుత్, రవాణా, అనుమతులు కల్పించి పెట్టుబడులను ఆకర్షించాలన్నారు. అదే సమయంలో ప్రైవేటు కంపెనీలు స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉద్యోగాలు కల్పించేలా స్పష్టమైన విధానాన్ని రూపొందించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేసే సంస్థలకు ప్రోత్సాహకాలు ఇస్తూనే, స్థానికంగా ఉద్యోగాలు కల్పించే అంశాన్ని తప్పనిసరి ప్రమాణంగా పరిగణించాలన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలను ఈ ఉద్యోగ మేళాల్లో భాగస్వామ్యం చేయాలన్నారు. మేళాల వివరాలను ముందుగానే అధికారిక వెబ్‌సైట్లు, సామాజిక మాధ్యమాలు, పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయడంతో పాటు ఎంపికైన అభ్యర్థులు వాస్తవంగా ఉద్యోగాల్లో చేరారా లేదా అనే విషయాన్ని ప్రభుత్వం పర్యవేక్షించాలన్నారు.

స్వయం ఉపాధి ప్రారంభించాలనుకునే పట్టభద్రులకు బ్యాంకు రుణాలు, సబ్సిడీలు, ప్రాజెక్టు నివేదికలు, లైసెన్సులు, మార్కెటింగ్ మార్గదర్శకత్వం అందించాలన్నారు.

ఎన్నికల హామీల్లో పేర్కొన్న నిరుద్యోగ భృతి అమలు స్థితి, అర్హతలు, దరఖాస్తు విధానం, చెల్లింపు తేదీలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో బలంగా ప్రస్తావించేందుకు, యువతకు న్యాయం జరిగేలా నిరంతరం పోరాడేందుకు తాను కట్టుబడి ఉన్నానని డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్ తెలిపారు.

## దొంగతనాల కేసుల ఛేదనలో సత్తా చాటిన రామన్నపేట పోలీసులు

**ఎస్ఐ సతీష్‌తో పాటు పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** వివిధ దొంగతనాల కేసులను సమర్థవంతంగా ఛేదించి నిందితులను గుర్తించడంలో ప్రతిభ కనబరిచిన రామన్నపేట పోలీసులను జిల్లా ఎస్పీ అభినందించారు. బంగారం చోరీ, రాగి చోరీ, మేకల దొంగతనంతో పాటు పలు కేసులను ఛేదించినందుకు రామన్నపేట ఎస్ఐ సతీష్‌కు ఎస్పీ ప్రశంసాపత్రం అందజేశారు. ఎస్ఐ సతీష్‌తో పాటు పోలీసు సిబ్బంది ప్రశాంత్, ప్రవీణ్, సురేష్, సత్యం తదితరులు కేసుల దర్యాప్తు, నిందితుల గుర్తింపులో కీలకంగా వ్యవహరించారు. పోలీసు బృందం సమష్టి కృషిని గుర్తించిన ఎస్పీ వారిని అభినందించారు. నేరాల నియంత్రణ, ప్రజల ఆస్తుల పరిరక్షణలో భాగంగా పోలీసులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఎస్పీ నుంచి ప్రశంసలు అందుకోవడం పోలీసు సిబ్బందిలో మరింత ఉత్సాహాన్ని నింపింది.

## సిపిఐ నేత ప్రకాష్ తల్లి జయమ్మ మృతి

**నివాళులు అర్పించిన పల్లా నెల్లికంటి**



**నాంపల్లి, అక్షిత న్యూస్:** మండల పరిధిలోని పసునూరు గ్రామంలో సిపిఐ సీనియర్ నాయకులు ప్రకాష్ తల్లి జయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. సిపిఐ మండల పార్టీ ద్వారా విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం మునుగోడు మాజీ శాసనసభ్యులు ఉజ్జిని యాదగిరిరావు వెంటనే పసునూరు గ్రామానికి చేరుకుని అనంతరం జయమ్మ పార్థివదేహాన్ని సందర్శించి వారి భౌతిక కాయం పై పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. వారితోపాటు సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు బాబురావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ అంజయ్య చారి, మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్ , సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెన్నోజు వెంకటాచారి, వడ్డేపల్లి ఉప సర్పంచ్ బుషిపాక యాదయ్య, సిపిఐ మండల నాయకులు పల్లేటి దశరథ,గొడ్డేటి సత్తయ్య,గొడ్డేటి రామచంద్రం, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొని జయమ్మ పార్థివదేహానికి నివాళులు అర్పించారు.

## భూముల రీ సర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**రీ సర్వే ప్రక్రియలో రైతుల సహకారం అవసరం**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** భూముల రీ సర్వే ద్వారా రైతుల భూ సమస్యలను పరిష్కరించడంతో పాటు, భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. మంగళవారం తానూరులో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులను సర్వే పురోగతి, చేపడుతున్న చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే నిర్వహించే ముందు సంబంధిత రైతులందరికీ ముందస్తుగా సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తూ, ఎలాంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సర్వే బృందంలోని సిబ్బంది అందరూ విధిగా పాల్గొని, నిర్దేశించిన గడువులోగా రీ సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

అనంతరం రైతులతో మాట్లాడిన కలెక్టర్, భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూముల సర్వే, రీ సర్వే ప్రక్రియను చేపడుతోందని తెలిపారు. సర్వే సమయంలో సంబంధిత భూముల రైతులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు తెలియజేయాలని సూచించారు. రీ సర్వే ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా పూర్తయ్యేందుకు రైతులు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ పరిశీలనలో తహసీల్దార్ మహేంద్రనాథ్, సర్వేయర్ కిషన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**




**ఆసిఫాబాద్ అక్షిత ప్రతినిధి :** 257వ ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ప్రాజెక్టు ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. సిర్పూర్--కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో అక్టోబర్ 16 నుంచి నవంబర్ 5 వరకు వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఇంపాక్ట్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 257వ లైఫ్‌లైన్ ఎక్స్‌ప్రెస్ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరాల ద్వారా వివిధ రకాల వ్యాధులకు ఉచిత వైద్య పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

ఈ నెల 16 నుండి 21వ తేదీ వరకు కంటి వైద్య శిబిరంలో ఓ పి డి, కంటి పరీక్షలు, 17 నుండి 22వ తేదీ వరకు శస్త్రచికిత్సలు 22 నుండి 27వ తేదీ వరకు చెవి వైద్య శిబిరంలో ఓ పి డి, పరీక్షలు, 23 నుండి 28వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు 28 నుండి 31వ తేదీ వరకు ఆర్థోపెడిక్ శిబిరంలో ఓ పి డి, పరీక్షలు, 29 నుండి నవంబర్ 1వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు ఈనెల 28 నుండి 31 వ తేదీ వరకు ప్లాస్టిక్ సర్జరీ శిరీరంలో చీలిక పెదవులు, కాలిన గాయాల తర్వాత ఏర్పడే సంకోచాలకు సంబంధించిన వైద్య పరీక్షలు, 29 నుండి నవంబర్ 1వ తేదీ వరకు శస్త్ర చికిత్సలు నవంబర్ 1వ తేదీ నుండి 5వ తేదీ వరకు దంత వైద్య శిబిరంలో పరీక్షలు, వైద్య సేవలు ఈ నెల 16వ తేదీ నుండి 21వ తేదీ వరకు మహిళల గర్భాశయ సంబంధిత సమస్యలు, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, పి.ఎ.పి. స్మియర్ స్క్రీనింగ్ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరాల గురించి తెలుసుకొని, సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు నిర్ణీత తేదీలలో ఆధార్ కార్డు / ఇతర గుర్తింపు కార్డులతో వైద్య శిబిరానికి హాజరై వైద్య సేవలను వినియోగించుకోవాలని, ఆసుపత్రిలో చేరిన రోగులతో పాటు ఒక వ్యక్తిని మాత్రమే అనుమతించడం జరుగుతుందని తెలిపారు. ఇతర వివరాలకు 7039673973 నంబర్ లో సంప్రదించవచ్చని తెలిపారు.

# తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు చొరవతో

# నియోజకవర్గ అద్భుత ప్రగతి..



జనార్ధన్

## మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా సంక్షేమ పథకాలపై విస్తృత సమావేశం

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

**తిరుమలగిరి,అక్షిత ప్రతినిధి:** తుంగతుర్తి నియోజకవర్గ అసెంబ్లీ మున్సిపల్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా ప్రభుత్వం – ప్రజాపాలనలో భాగంగా నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు సుంకరి జనార్ధన్ మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు నిరంతర శ్రమ, ప్రత్యేక చొరవతోనే తుంగతుర్తి నియోజకవర్గం నేడు అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని కొనియాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొమ్మటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డిల సహకారంతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను దిగ్విజయంగా అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వానికి స్పష్టమైన తేడా ఉందన్న ఆయన, గతంలో నిలిచిపోయిన రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం తదితర పథకాలను స్థానిక ఎమ్మెల్యే సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా తీర్చేందుకు ఎమ్మెల్యే మందుల సామేలు ప్రత్యేక కృషి చేసి రూ. 2,200 కోట్లకు పైగా నిధులను మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే జానికిపురం, తాటిపాముల, అనంతారం, ధర్మారం, లక్ష్మీదేవికాల్వ, వర్ధమానుకోట ప్రాంతాల్లో ఆరు చెక్ డ్యామ్‌ల నిర్మాణం ద్వారా రైతులకు సాగునీరు అందుబాటులోకి తెచ్చారని, గంధమల్ల రిజర్వాయర్ ద్వారా మోత్కూరు మండలంలో కాలువల ద్వారా నీటిని అందించినట్లు చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో సాధించిన ప్రగతిని వివరిస్తూ, తిరుమలగిరి మండలంలో 40 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే చొరవతో మంజూరు చేయించి దాదాపు 200 మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చారని, తొండ గ్రామంలో రూ. 200 కోట్లతో ఎల్ కేజీ టు పీజీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వైద్యరంగంలో భాగంగా తుంగతుర్తిలో 100 పడకల ఆసుపత్రి శంకుస్థాపనకు చర్యలు వేగవంతం చేశారని, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ. 22 కోట్లతో సిసి రోడ్ల పనులు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మిలాల్ నాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ పానగంటి నర్సింహారెడ్డి, నాగారం మండల పార్టీ అధ్యక్షులు వెంకటబిక్షం, పి సి ఎస్ పాలపు చంద్రశేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు తిరుమణి యాదగిరి, బత్తుల శ్రీనివాస్, కన్నబోయిన మల్లయ్య, సర్పంచులు బెట్టెం రాజు, భూక్యా బిచ్చు నాయక్, నాయకులు కందుకూరి లక్ష్మయ్య, శేఖర్ రెడ్డి, వీరు నాయక్, గుగులోతు భాస్కర్, పేరాల నరేష్ తదితరులు పాల్గొన్నారు. ముగింపులో ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ఎల్‌నినోపై ముందస్తు కార్యాచరణ

## గ్రామాల వారీగా పంటల పరిస్థితిపై అంచనా వేయాలి

## జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్, అక్షిత బ్యూరో:** ఎల్‌నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున వ్యవసాయ రంగంపై పడే ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళ వారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆరు తడి పంటలు పండించేలా రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

గ్రామాల వారీగా పంటల పరిస్థితి, నీటి లభ్యతను అంచనా వేయాలని సూచించారు. పంటలు ఎండిపోయే పరిస్థితులున్న గ్రామాలు, నీటి కొరత ఏర్పడే అవకాశమున్న ప్రాంతాలను క్షేత్రస్థాయిలో గుర్తించి నివేదికలు సమర్పించాలన్నారు.



వర్షపాతం, భూగర్భ జలాలు, సాగునీటి వనరుల లభ్యతపై సమగ్ర సమాచారం సేకరించి నివేదికలు సమర్పించాలని పేర్కొన్నారు.

వాతావరణ అంచనాలను నిరంతరం పరిశీలిస్తూ పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని, రైతులకు అవసరమైన సూచనలు అందించి పంట నష్టాన్ని నివారించేందుకు క్షేత్రస్థాయి లో పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఉద్యాన వన శాఖ అధికారి శ్రీనివాస్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 189 మంది వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి ఈ సందర్భంగా మాట్లాడుతూ, వయోవృద్ధులు స్వయం సహాయక సంఘాలలో చేరడం వల్ల చేకూరే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలపై ఈ సందర్భంగా వారికి సమగ్రమైన అవగాహన కల్పించారు.

వయోవృద్ధులలో పొదుపు అలవాటును పెంపొందించడం, ఆర్థిక స్వావలంబన సాధించడం, సంఘాల ద్వారా పరస్పర సహకార ప్రాముఖ్యతను వివరించారు. వారి జీవనోపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లభించే రకరకాల ప్రయోజనాలను ఏ విధంగా వినియోగించుకోవాలో తెలియజేశారు. వయోవృద్ధులతో బతుకమ్మలను స్వయంగా తయారు చేయించి, వారితో బతుకమ్మ ఆటపాటలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది, వయోవృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాలలో అన్నదానం గొప్పది

## మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** మాహా దానాలలో అన్నదానం మహా శ్రేష్ఠమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదల పావని రమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని భవాని యూత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ మొగుదల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు. భవాని యూత్ అసోసియేషన్ వారు చేస్తున్న కార్యక్రమాలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయని ప్రముఖ వైద్యురాలు డా శ్వేత ప్రియాంక మూల సుధీర్ లు అన్నారు. ఈ కార్యక్రమంలో 19 వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, భవాని యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు వరగంటి రాజేందర్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గోపగాని లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షుడు వరగంటి మహేందర్ గౌడ్, మారుపాక శ్రీశైలం గౌడ్, మునుకుంట్ల చంద్రశేఖర్, వరగంటి అమరేందర్ గౌడ్, కాసాని సాయి కుమార్ గౌడ్, అవిరేణి ప్రభాస్ రాజ్, దండేపల్లి శివ, బొబ్బిళ్ళ ఉత్తేజ్, వరగంటి వరుణ్ కుమార్ గౌడ్, దండేపల్లి శంకర్, మారుపాక మహేష్ గౌడ్, వినయ్, ఉడుగు గౌతమ్ గౌడ్, ఏర్కాలి అభిరామ్ గౌడ్, బిజిలి బబ్లు, మారుపాక రామ్ చరణ్ గౌడ్, వినీత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణాపూర్‌లో ఉచిత నేత్ర వైద్య శిబిరం



మందమర్రి, అక్షిత ప్రతినిధి: లయన్స్ క్లబ్ ఆఫ్ రామకృష్ణాపూర్ అధ్యక్షుడు లయన్ నులుగొండ సత్యం ఆధ్వర్యంలో, బెల్లంపల్లి సత్యనారాయణ లయన్స్ కంటి ఆసుపత్రి సహకారంతో ఈ నెల 15వ తేదీ గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రామకృష్ణాపూర్‌లోని బి-జోన్ వర్తక గణేష్ మండపంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ శిబిరం కొనసాగనుంది. అనుభవజ్ఞులైన వైద్యులు కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహిస్తారు. మోతిబిందు (కంటిలో శుక్లాలు) ఉన్నవారిని గుర్తించి, ఆపరేషన్ అవసరమైన వారికి పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.రామకృష్ణాపూర్, క్యాతనపల్లి, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శస్త్రచికిత్స చేయించుకునే వారు ఓటరు గుర్తింపు కార్డు లేదా రేషన్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ఎ. సత్యనారాయణ, కోశాధికారి పిల్లి సతీష్, సేవా విభాగం అధ్యక్షుడు వనం సత్యనారాయణ, పూర్వ అధ్యక్షుడు వేముల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో బతుకమ్మ సంబరాలు



చౌటుప్పల్/ అక్షిత న్యూస్: చౌటుప్పల్ బంగారుగడ్డ లోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి లోని వార్డులను రంగురంగుల పూలతో అలంకరించారు.ఆయుధ పూజ నిర్వహించారు. తెలుపు రంగు దుస్తులు ధరించి రోగులకు వైద్య సేవలు అందించడంలో తీరికలేకుండా ఉండే వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. పలు రకాల పూలను తెచ్చి బతుకమ్మలుగా పేర్చి ఆస్పత్రి ఎదుట ప్రతిష్టించి లయబద్ధంగా ఆడుతూ, గొంతెత్తి పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. ఆసుపత్రి ఎదుట ఉన్న దేవతకు పూజలు నిర్వహించి బోనం సమర్పించారు . పురపాలక చైర్పర్సన్ మోగుదాల పావని, కౌన్సిలర్ బత్తుల జయమ్మ ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్య శ్రీరావు ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఆర్ ఎం ఓ చంద్రశేఖర్, వైద్యాధికారులు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి ప్రియ, డాక్టర్ కావేరి, డాక్టర్ నజీమా, డాక్టర్ అనిల్ కుమార్, డాక్టర్ అవినాష్, సీనియర్ అసిస్టెంట్ జయమ్మ, కవిత, నర్సింగ్ సూపరింటెండెంట్ లు భాగ్యమ్మ, రజనీ లక్ష్మి, హెడ్ నర్సులు అనంత, వీరమ్మ తదితరులు బతుకమ్మ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. దసరా పండుగ సందర్భంగా శానిటేషన్ సిబ్బందికి నూతన వస్త్రాలను పురపాలక చైర్పర్సన్ మోగుదాల పావని, డిసిహెచ్ఎస్ సూర్య శ్రీ రావు చేతుల మీదుగా పంపిణీ చేశారు.బతుకమ్మ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

## వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్టు ఉద్యోగులను

# రెగ్యులరైజ్ చేయాలి

### వారి న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్



కరీంనగర్ అక్షిత బ్యూరో: వైద్య ఆరోగ్యశాఖలో సుమారు 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని జిల్లా సచివాలయం ఎదురుగా నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎన్ హెచ్ ఎం జేఏసీ) ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల వెళ్లి మద్దతూ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. కరీంనగర్ జిల్లాలో సుమారు 500 మంది, రాష్ట్రవ్యాప్తంగా 17 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారని, వారిని క్రమబద్ధీకరించడం ప్రభుత్వానికి పెద్ద ఆర్థిక భారం కాదని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఉద్యోగుల సేవలను ప్రభుత్వం గుర్తించాలని ఆయన కోరారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న వారిని కాంట్రాక్టు పద్ధతిలోనే కొనసాగిస్తూ, చివరకు అదే విధానంలో పదవీ విరమణ చేసే పరిస్థితి రావడం బాధాకరమన్నారు. అర్హులైన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయకుండా దొడ్డిదారిన నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. ఉద్యోగుల సీనియారిటీ, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందాలంటే ముందుగా వైద్య ఆరోగ్యశాఖను బలోపేతం చేయాలన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, వారికి రావాల్సిన ప్రయోజనాలు కల్పిస్తేనే వైద్య సేవలు మరింత మెరుగుపడతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో విషజ్వరాలు, స్వైన్‌ఫ్లూ, డెంగ్యూ, తదితర అంటువ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజారోగ్యాన్ని కాపాడటంలో వైద్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని చెప్పారు.నగర అభివృద్ధి పనులపై కూడా గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని విమర్శించారు. నగరంలో రహదారులు, కేబుల్ బ్రిడ్జి, రివర్ ఫ్రంట్, తిరుమల తిరుపతి దేవస్థానం ఆలయ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. రహదారుల నిర్మాణానికి సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదని విమర్శించారు. నగరంలో రహదారులు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల సమస్యలను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి, వారి న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.రేపటి రోజున బిఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామగుండం పర్యట ఉన్న సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులను కేటీఆర్ కు కల్పిస్తామని వారికి హామీ ఇచ్చారు.వారి సమస్యలను పార్టీ తరపున రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగులతో పాటు ఎన్.హెచ్.ఎం.జే.ఏ.సీ కరీంనగర్ అధ్యక్షులు ఈ. రమేష్, ఉపాధ్యక్షులు ఎండి కలిక్, డాక్టర్ వెంకటేష్ వర్కింగ్ ప్రెసిడెంట్, కే.రమేష్, జాయింట్ సెక్రెటరీ ఎస్.సాగర్, డిస్టిక్ కో ఆర్డినేటర్, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక ఉత్సవాలు సమాజంలో

# భక్తిభావాన్ని పెంపొందిస్తాయి..!

### ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి..!

### నెహ్రూ కాలనీలో దుర్గామాత మండపాని సందర్శించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..!

### బుగ్గారెడ్డి గార్డెన్ లో రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు..!





షాద్ నగర్, అక్షిత ప్రతినిధి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా షాద్ నగర్ పట్టణంలోని నెహ్రూ కాలనీలో కాలానివాసులు ఏర్పాటు చేసినఅన్న వితరణ పూజా మరియు బుగ్గారెడ్డి గార్డెన్లో రెడ్డి సేవాసమితి,రెడ్డి మహిళా సేవా సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాల కార్యక్రమాలలో ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ నవరాత్రి వంటి ఆధ్యాత్మిక ఉత్సవాలు సమాజంలో భక్తిభావాన్ని పెంపొందించడమే కాకుండా,మన సాంప్రదాయాలను భావితరాలకు అందిస్తాయని, అమ్మవారి కృపతో సమాజంలో ప్రతి ఒక్కరూ శాంతిసౌఖ్యాలతో వర్ధిల్లాలని,మండప నిర్వాహకులు ఇలాగే భక్తిభావంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన ఆకాంక్షించారు. బతుకమ్మ సంబరాలు మన తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు.ఈ కార్యక్రమంలో విష్ణు వర్ధన్ రెడ్డి,షాద్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీరం గూడ జగన్ మోహన్,గ్రంథాలయ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి,మాజీ జడ్పి టిసి తాండ్ర విశాల రెడ్డి, పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, మహాదేవ్ పూర్ సర్పంచ్ అనూష రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ పాలమకుల చెన్నయ్య,మాజీ సర్పంచ్ నాగర్ కుంట ఉమా ప్రవీణ్ రెడ్డి, రవీందర్ రెడ్డి, నరసింహా రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, అరుంధతి రెడ్డి, మోహన్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, శ్రీపాల్ రెడ్డి, అజయ్ రెడ్డి, విజయ్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి మరియు నవీన్ రెడ్డి, రెడ్డి సేవ సమితి సభ్యులు, యువ జన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు..

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY



# సిఈఐఆర్ పోర్టల్ ద్వారా 115 సెల్‌ఫోన్ల రికవరీ

## జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్

**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2492 మొబైల్ ఫోన్ల రికవరీ నిర్మల్ జిల్లా వ్యాప్తంగా పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ (సెంట్రల్ ఈక్వయిపమెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ ) పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేయడంలో నిర్మల్ జిల్లా పోలీసులు సత్ఫలితాలు సాధిస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా రికవరీ చేసిన సుమారు రూ.13 లక్షల 80 వేల విలువైన 115 సెల్‌ఫోన్లను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ బాధితులకు అందజేశారు.






సీఈఐఆర్ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగిస్తూ జిల్లా పరిధిలో ఇప్పటివరకు మొత్తం 2492 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రస్తుత జీవన విధానంలో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ అత్యంత కీలకమైన పరికరంగా మారిందని, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా లేదా చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు.

బాధితులు స్వయంగా పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చని, లేదా మొబైల్ ఫోన్‌కు సంబంధించిన వివరాలు, అవసరమైన ధ్రువపత్రాలతో సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. సీఈఐఆర్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను బ్లాక్ చేయడంతో పాటు, సాంకేతిక ఆధారాలతో గుర్తించి రికవరీ చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

మార్కెట్లు, బస్టాండ్లు, బస్సులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో ప్రజలు తమ మొబైల్ ఫోన్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రద్దీ సమయంలో మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే ముందు బిల్లు, ఐఎంఈఎం నంబర్, ఫోన్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. సరైన ధ్రువీకరణ లేకుండా లేదా అనుమానాస్పదంగా విక్రయిస్తున్న మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయవద్దని ప్రజలకు సూచించారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు తిరిగి అందించేందుకు నిర్మల్ జిల్లా పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ కృషి చేసిన ఐటీ కోర్ సిబ్బంది, సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ తో పాటు అదనపు ఎస్పీ డి. ఉపేందర్ రెడ్డి, ఆర్ఐ అడ్మిన్ రామ్ నిరంజన్, ఐటీ కోర్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# సల్మాన్ ఖాన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్

## మహాముత్తారం ఎల్పిఆర్ లయన్స్ టీమ్‌కు జెర్సీలు బహూకరించిన బీఆర్ఎస్ నాయకులు




**మంథని, అక్షిత ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన మహదేవపూర్ టీఆర్ఎస్ (బీఆర్ఎస్) మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్ స్మారకార్థం స్థానికంగా క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్న మహాముత్తారం మండల టీం "మహాముత్తారం ఎల్పిఆర్ లయన్స్" (ౘ్రా= ౫ఆశీఅం) క్రీడాకారులకు మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు క్రీడా దుస్తులను స్పాన్సర్ చేశారు.

మహాముత్తారం మండల బీఆర్ఎస్ యువ నాయకులు లక్కిరెడ్డి ప్రణతి – ప్రశాంత్ రెడ్డి సౌజన్యంతో క్రీడాకారులకు జెర్సీలు, లోయర్లను స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సమక్షంలో ఘనంగా పంపిణీ చేశారు.

ఈ క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమంలో మహాముత్తారం బీఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్పీటీసీ మండల రాజిరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ మార్క రాము గౌడ్, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ వెల్మరెడ్డి అనిల్ రెడ్డి, మహాముత్తారం సర్పంచుల ఫోరం అధ్యక్షులు అజ్మీరా ధరం సింగ్ (బోర్లగూడెం సర్పంచ్) పాల్గొని క్రీడాకారులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగున్న క్రీడా ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని, దివంగత నాయకుడు సల్మాన్ ఖాన్ జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ కో-ఆప్షన్ మెంబర్ మిర్జా సాలార్ బేగ్, నిమ్మగూడెం సర్పంచ్ జాడి రాజేష్, పోలారం సర్పంచ్ అంబాల రాజబాబు, మండల యూత్ కన్వీనర్ జాతోట్ జైపాల్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు పంగ సంపత్, వివిధ గ్రామాల క్రీడాకారులు మరియు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు పాల్గొన్నారు

# వేపూరు గ్రామంలో కోకో కోచింగ్ ప్రారంభం



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** కల్వకుర్తి మండల పరిధిలోని వేపూరు గ్రామంలోని యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు కోకో కోచింగ్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ నాగరాజు, ఉపసర్పంచ్ రాసమల్ల కృష్ణయ్య, హెడ్మాస్టర్ వాసుదేవుడు, పీటీ భాష, మౌని, బాలస్వామి ఆధ్వర్యంలో ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి రాష్ట్రస్థాయికి ఎదగాలని మనస్ఫూర్తిగా కోరారు.

# నేడు అచ్చంపేటకు వచ్చేస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్వాగతం



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్కర్నూల్ జిల్లాలోని అచ్చంపేట నియోజకవర్గానికి నేడు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వస్తువుల సందర్భంగా మేగావత్ సరిత శక్రు – సర్పంచ్ లక్ష్మాపూర్ స్వాగతి సుస్వాగతం తెలిపారు. అదేవిధంగా అచ్చంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమాణ స్వీకారోత్సవం వివిధ అభివృధి కార్యక్రమాలకు అచ్చంపేట కు విచ్చేయుచున్న ఉప ముఖ్యమంత్రి ఁ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తుమ్మల నాగేశ్వరరావు గార్లకుస్వాగతం – సుస్వాగతం తెలిపారు.

# అన్నపూర్ణాదేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనం



**రామన్నపేట, అక్షిత ప్రతినిధి :** ప్రతి జీవికి జీవనాధారం ఆహారం. అన్నపూర్ణాదేవి సకల జీవరాశులకు ఆహారాన్ని అందించే దేవత. అన్నం పరబ్రహ్మ స్వరూపం! మానవాళికి అలాంటి అన్నాన్ని అందించేది అన్నపూర్ణాదేవిని ఈ శరన్నవరాత్రులలో పూజిస్తే అన్నానికి లోటుండదంటారు. దసరా దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామన్నపేట పట్టణ కేంద్రంలోని ఎంప్లాయిస్ కాలనిలో వినాయక మిత్ర మండలి అసోసియేషన్ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, హోమం నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అక్కెనపల్లి ప్రవీణ్ కుమార్, బాకూరి శివ, ఒంటెద్దు రమేష్, కందుకూరు శంకర్, బత్తుల శీను, మినుముల సందీప్, రాచకొండ రాజేష్, నామానంది వినయ్,గంగాపురం గణేష్, శ్యామల ప్రవీణ్, ఒంటెద్దు బాలకృష్ణ, రేవంత్, ఉష, బడుగు లావణ్య రఘు, మద్దెగల్ల కళ్యాణి నరసింహా, కోట ఉమాశ్రీ విజయ్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయం

**బీఆర్ఎస్ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కామినేని హాస్పిటల్స్ (ఎల్బీనగర్) వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి అన్నారు.రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలోని రైతు వేదిక ప్రాంగణంలో వారం రోజుల క్రితం వెల్లంకి గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కామినేని హాస్పిటల్స్ (ఎల్బీనగర్) వారి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించి వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఎడ్ల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు, మందులను ఉచితంగా అందించడం ద్వారా ఆరోగ్య పరిరక్షణ కు దోహదపడుతున్నారని పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. మంగళంపల్లి గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు జ్వరం, జలుబు, నీరసం, వివిధ రకాల నొప్పులకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కామినేని హాస్పిటల్స్ వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏడవ వార్డులో చెత్తబుట్టల పంపిణీ

**పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత**

**7వ వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి**



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** చౌటుప్పల్ మున్సిపల్ లోని లక్కారం ఏడో వార్డులో తడి, పొడి చెత్తబుట్టలు, మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని వార్డు కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. వార్డు ప్రజలకు తడి,పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని కౌన్సిలర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..మన ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటారని, ప్రతి ఒక్కరూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా తడి చెత్త, పొడి చెత్త ను వేరుచేసి చెత్త బుట్టలో వేసి మున్సిపల్ చెత్త బండి లోనే వేయాలని సూచించారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయడం వల్ల వాటి వల్ల వచ్చే దుర్వాసన, దోమల వల్ల కాలనీవాసులు అనారోగ్యానికి గురి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. కాబట్టి ప్రతి ఒక్కరు మన ఇంటిని ఏ విధంగా అయితే శుభ్రంగా ఉంచుకుంటామో పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. అలాగే పర్యావరణాన్ని కాపాడుకోవడానికి మొక్కల పెంపకం యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐలయ్య, మున్సిపల్ సిబ్బంది,కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఖమ్మం ఘనంగా ఫుడ్ అండ్ కిడ్స్ ఫ్యాషన్ ఫెస్టివల్ 2026 - ప్రారంభం

**పిల్లలను పెద్దలను ఆకట్టుకుంటున్న స్టాల్స్**

**పిల్లల దసరా సెలవలకు ఖమ్మంలో ప్రత్యేక హాట్ స్పాట్‌గా ఈవెంట్**



**ఖమ్మం /అక్షిత బ్యూరో :** ఖమ్మం నగరంలోని ఎన్‌టీఆర్ పార్క్ లకారం ట్యాంక్ బండ్ వేదికగా ఖమ్మం ఫుడ్ అండ్ కిడ్స్ ఫ్యాషన్ ఫెస్టివల్ 2026 ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖులు రాజకీయ నాయకులు వ్యాపారవేత్తలు వివిధ రంగాల ప్రతినిధులు ప్రజల సమక్షంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ప్రారంభోత్సవానికి సీనియర్ రాజకీయ నాయకులు కమర్తపు మురళి ఖమ్మం లో ప్రముఖ వైద్యులు డా. ప్రదీప్ కుమార్ ఇమేజ్ మేనేజర్ తెలంగాణ ఒప్పో శ్రీకాంత్ నంగునూరి రిటైల్ మహమ్మద్ అమీర్(ఒప్పో సిఎంవో ) ఫౌండర్ అండ్ డైరెక్టర్ గణిత్రా కన్సల్టెంట్ సర్వీసెస్ శ్రీకాంత్ నామ ప్రొఫెసర్ కార్తిక్ నామ ( డైరెక్టర్, ఆర్డిఐవో ఏఐ) వర్షంత్ (తిరుపతి ఈవెంట్ డైరెక్టర్) మిసెస్ తెలంగాణ అలేఖ్య కోపురి సీనియర్ కార్పోరేటర్ కర్నాటి కృష్ణ హాజరైనరు. ఈ కార్యక్రమానికి విచ్చేసి తమ విలువైన సమయాన్ని కేటాయించిన అతిథులందరికీ స్పాన్సర్లకు సహకార సంస్థలకు పాల్గొన్న వారందరికీ తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఖమ్మం లో అక్టోబర్ 13,14 న మరో రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా సంబరాలు జరగనున్నాయి.




ఈ కార్యక్రమానికి ప్రారంభం రోజు 1,250 మందికి పైగా హాజరై విజయవంతం చేశారు. రాబోయే రెండు రోజుల్లో మరిన్ని సాంస్కృతిక కార్యక్రమాలు వినోద కార్యక్రమాలు ఆహార స్టాళ్లు పిల్లల ఫ్యాషన్ షోతో సందడి కొనసాగనుంది.

**ప్రత్యేక ఆకర్షణ -- బతుకమ్మ పోటీలు**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ పోటీలు నిర్వహించనున్నాం. విజేతలకు మొత్తం రూ. 10,000 నగదు బహుమతులు అందజేయబడతాయని నిర్వాహకులు తెలిపారు.

# షాద్ నగర్‌లో దొంగల హల్ చల్..!

**తిరుపతి వెళ్లేందుకు సిద్ధమవుతుండగా చోరీ!**

**రూ.4 లక్షల నగదు, 5 తులాల బంగారం, అర్ధ కిలో వెండి అపహరణ**

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన క్రైమ్ ఎస్సై శివారెడ్డి**





**షాద్ నగర్, అక్షిత ప్రతినిధి:** తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న కుటుంబాన్ని దొంగలు లక్ష్యంగా చేసుకున్నారు. కుటుంబ సభ్యులు ప్రయాణానికి కావాల్సిన సామగ్రిని సర్దుకుని నిద్రపోగా, ఇదే అదునుగా భావించిన దొంగలు కిరాణా షాపు లో చోరీకి పాల్పడ్డారు.రూ. 4 లక్షల నగదు, ఐదు తులాల బంగారం, అర్ధ కిలో వెండిని అపహరించుకుపోయారు. ఈ ఘటన షాద్‌నగర్ పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళ్తే.. క్రిస్టియన్ కాలనీకి చెందిన సత్యం సంధ్య కిరణం షాపు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు..మంగళవారం కుటుంబ సభ్యులు తిరుపతి యాత్రకు వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రయాణ సామగ్రిని సిద్ధం చేసుకుని రాత్రి నిద్రపోయారు.అయితే తెల్లవారుజామున సంధ్యాకిరణం షాపు వద్దకు వెళ్లి చూసిన సమయంలో నగదు, బంగారం, వెండి చోరీకి గురైనట్లు గుర్తించినట్లు సమాచారం.

చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన బాధితుడు సత్యం వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న క్రైమ్ ఎస్సై శివ రెడ్డి తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.తిరుపతి యాత్రకు వెళ్లేందుకు సిద్ధమైన సమయంలోనే చోరీ జరగడంతో బాధిత కుటుంబం ఆవేదనకు గురయ్యారు..

# ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

**స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ భరత్ కుమార్ డిమాండ్**




**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్లో జిల్లా ఎన్ హెచ్ యం ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మె చేపట్టారు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 17వేల మంది ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం రోడ్డు కెక్కి సమ్మె చేపట్టారు.

ఎన్ హెచ్ ఎం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ టి భరత్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రజా ఆరోగ్య పరిరక్షణలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉద్యోగ భద్రత న్యాయమైన వేతనాలు సేవ ప్రయోజనాలు వంటి సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం వెట్టి చాకిరీ చేపిస్తుందని అన్నారు. ఎన్నో ఏండ్లుగా సేవలందిస్తున్న ఉద్యోగులందరిని కాంటినెంట్ ఉద్యోగుల నుండి డాక్టర్ వరకు నిబంధన ప్రకారం షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఎన్ హెచ్ ఎం 78 క్యాడల ఉద్యోగులకు ఉద్యోగ భద్రత పిఆర్సి న్యాయమైన వేతనాలు గ్రాస్ శాలరీ వార్షిక ఇంక్రిమెంట్లు రాయల్టీ బోనస్ ఉద్యోగులకు ఆరోగ్య భీమా ఇతర సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలన్నారు.

ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీందర్ నితిన్ రెడ్డి డాక్టర్ హరికృష్ణ డాక్టర్ మోహన్ రావు డాక్టర్ మధు డాక్టర్ యశస్విని ఎల్ ఎస్ ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.